క్లుప్తంగా

నీటి వృథా.. నిర్లక్ష్యం చెద!



వాల్వ్ నుంచి వృథాగా పోతున్న భగీరథ నీరు

బషీరాబాద్: అధికారుల నిర్లక్ష్యం వలన మిషన్ భగీరథ నీరు వృథాగా పోతోంది. కాశీంపూర్–తాండూరు ప్రధాన రోడ్డు పక్కన నారాయణపూర్ గేటు సమీపంలో నాలుగు రోజులుగా వాల్వ్ లీకై.. గ్రామాల్లోకి వెళ్లాల్సిన తాగునీరు పంట పొలాలకు పారుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే వాల్వ్‌ను సరి చేయాలని కోరుతున్నారు.

రేషన్ నిల్వలకు ఇబ్బందులు



దుద్యాల్‌కు వచ్చిన బియ్యం బస్తాలు దించుతున్న కూలీలు

దుద్యాల్: మూడు నెలల రేషన్ బియ్యం ఒకేసారి పంపిణీ చేస్తుండడంతో స్టాక్ నిల్వలకు డీలర్లు ఇబ్బందులు పడుతున్నారు. రేషన్ షాపులో మూడు నెలల బియ్యం స్టాక్‌ను నిల్వ ఉంచుకోవడానికి స్థలం లేకపోవడంతో కొంత వరకు స్టాక్ తెప్పించుకుని పంపిణీ పూర్తైన తర్వాత తీసుకువస్తున్నారు. దీంతో రెండు రోజులు పంపిణీ చేయకపోవడంతో బియ్యం ఇవ్వడం లేదంటూ ప్రజల నుంచి ఆరోపణలు వస్తున్నాయి.

డిప్యూటీ సీఎంకు శుభాకాంక్షలు



చేవెళ్ల: డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన జన్మదినం సందర్భంగా నగరంలోని ప్రజాభవన్‌లో ఆదివారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

చార్జీల పెంపును ఉపసంహరించుకోవాలి

మొయినాబాద్: ప్రభుత్వం పెంచిన ఆర్టీసీ బస్‌పాస్ చార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలని బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు క్యామ పద్మనాభం డిమాండ్ చేశారు. ఆదివారం మొయినాబాద్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బస్‌పాస్ చార్జీల పెంపుతో సామాన్య, మధ్యతరగతి కుటుంబాలు, విద్యార్థులపై తీవ్ర భారం పడుతుందన్నారు. వెంటనే పెంచిన చార్జీలను ఉపసంహరించుకోవాలని కోరారు.

సమస్యకు పరిష్కారం

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎదుట మట్టిపోయించిన దాత వెంకట్‌రెడ్డి



వర్షపునీరు నిల్వ ఉండకుండా పోయించిన మొరం మట్టి

చేవెళ్ల: చేవెళ్లలోని ప్రభుత్వ జిల్లాపరిషత్ బాలికల పాఠశాల ముందు చేరిన వర్షపునీటిలోనుంచి విద్యార్థులు స్కూలుకు వెళ్లేందుకు పడుతున్న ఇబ్బందులను ఓ దాత ముందుకు వచ్చి పరిష్కరించారు. పాఠశాల ముందు వర్షపునీరు నిండడంతో సమస్యల తో స్వాగతం అని 13వ తేదీన సాక్షి పత్రికలో వచ్చిన కథనంపై చేవెళ్లకు చెందిన పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి స్పందించారు. స్వచ్ఛందంగా ఆయన సొంత నిధులు వెచ్చించి పాఠశాల గేట్ ముందు మొరం మట్టి పోయించి నీళ్ల నిల్వ ఉండకుండా చర్యలు తీసుకున్నారు. దాత వెంకట్‌రెడ్డి వెంటనే స్పందించి శనివారం మట్టి పోయించినందుకు మండలంలోని ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆయనను చేవెళ్ల సోషల్ మీడియ వే దికగా ప్రత్యేకంగా అభినందించారు.

అతివేగం ప్రమాదకరం

- నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు
- గ్రీన్ ఫార్మాసిటీ సీఐ కృష్ణంరాజు

యాచారం: అతివేగం ప్రమాదకరమని, రోడ్డు నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సీఐ లిక్కి కృష్ణంరాజు హెచ్చరించారు. పీఎస్ పరిధి కుర్మిద్ద గ్రామం, తాడిపర్తి– మీరాఖాన్‌పేట గ్రామాల మధ్య ఆదివారం సాయంత్రం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనదారులు డ్రైవింగ్ లైసెన్సులు కలిగి ఉండాలని సూచించారు. ఎస్‌ఐ తేజంరెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కాంట్రాక్టర్ నిర్లక్ష్యం.. ఇబ్బంది పడిన జనం

- ముందు జాగ్రత్తలు తీసుకోకపోవడంతో విరిగిన స్తంభాలు
- తెగిపడిన విద్యుత్ వైర్లు

బొంరాస్‌పేట: మండల కేంద్రం నుంచి మెట్లకుంట మీదుగా బుర్రితండా వరకు జరుగుతున్న డబుల్‌రోడ్డు నిర్మాణం పనుల్లో సంబంధిత కాంట్రాక్టరు ఇష్టారాజ్యంగా, ముందస్తులు జాగ్రత్తలు పాటించకపోవడంతో పలు ప్రమాదాలు, ఇబ్బందులు తలెత్తుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఆదివారం జరుగుతున్న రోడ్డు నిర్మాణం పనుల్లో వినియోగించిన యంత్రాలు విద్యుత్ స్తంభాలకు తగలడంతో పలు చోట్ల విద్యుత్ స్తంభాలు విరిగి ట్రాన్స్‌ఫార్మర్లపై పడ్డాయి. దీంతో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయి. రోడ్డుకు అడ్డంగా విద్యుత్‌తీగలు పడిపోవడంతో సాయంత్రం వరకు రాకపోకలకు వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ట్రాన్స్‌కో ఏఈ నాగరాజు దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన చర్యలు తీసుకున్నారు. మరిన్ని ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విరిగిన విద్యుత్ స్తంభం





రోడ్డుపై తెగిపడిన విద్యుత్ వైర్లు

బీసీ హక్కుల సాధనే లక్ష్యం



మొయినాబాద్ రూరల్: జెండా ఆవిష్కరిస్తున్న రామేశ్వరయ్య

కొందుర్గు: బీసీలందరూ హక్కుల సాధనే లక్ష్యంగా పనిచేయాలని బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణయ్య పేర్కొన్నారు. ఆదివారం బీసీసేన మండల మహిళా అధ్యక్షురాలు అనిత ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

మండల అధ్యక్షుడిగా రమేశ్

బీసీసేన కొందుర్గు మండల అధ్యక్షుడిగా ఐలపురం రమేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా గౌరి శంకర్, ప్రధాన కార్యదర్శిగా చిన్న రాజు గౌడ్, కార్యదర్శిగా నర్సింలు, కోశాధికారిగా శ్రీను ఎన్నికయ్యారు. జిల్లా అధ్యక్షుడు సుధాకర్, నాయకులు సుధాకర్ రావు, చంద్రస్వామి, బుచ్చిలింగం, ఎల్లప్ప, చంద్రశేఖర్, మల్లేశ్ పాల్గొన్నారు.

బీసీ కులాల అభివృద్ధే ధ్యేయం

మొయినాబాద్ రూరల్: బీసీ కులాల అభివృద్ధే ధ్యేయమని సాధన సమితి ఉపాధ్యక్షుడు, చేవెళ్ల నియోజకవర్గం ఇన్‌చార్జి సంగం రామేశ్వరయ్య పేర్కొన్నారు. ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా జెండా పండుగ కార్యక్రమంలో భాగంగా మొయినాబాద్ చౌరస్తాలో జెండా ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉప్పరియాదయ్య సాగర్, సాంబ సాగర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ నాయకులు

అలుపెరగని పోరాటంతోనే వర్గీకరణ

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల్ల ఉపేందర్

షాద్‌నగర్‌రూరల్: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ సారథ్యంలో అలుపెరగని పోరాటంతోనే వర్గీకరణ సాధించుకున్నామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి రాగల్ల ఉపేందర్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని దూసకల్‌లో ఆదివారం ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు మహేందర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడారు. 30ఏళ్ల ఎమ్మార్పీఎస్ పోరాటం, దండోరా ఉద్యమ చరిత్రను దళిత జాతికి తెలియజేయాల్సిన అవసరం ఉందని అన్నారు. జూలై 7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలను నిర్వహించడం జరుగుతుందని, ఈ సందర్భంగా వర్గీకరణ ఉద్యమానికి సహకరించిన అన్ని కులాల పెద్దలను ఆహ్వానించి సత్కరించనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నర్సింహ, నాయకులు బాలరాజు, శ్రీకాంత్, రాజు, మల్లేష్, శ్రీకాంత్, నరహరి, శేఖర్, శ్రీశైలం, రాహుల్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

భూములు లాక్కోవాలనుకోవడం అన్యాయం

మొయినాబాద్: ఏళ్లుగా పేద, బడుగు బలహీన వర్గాల రైతులు సాగుచేసుకుంటున్న భూములను గోశాలకు ఇస్తామంటూ ప్రభుత్వం లాక్కోవడం అన్యాయమని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం అన్నారు. మున్సిపల్ పరిధి ఎనికేపల్లి సర్వేనంబర్ 180లోని వంద ఎకరాల భూములను ఆదివారం ఆయన పరిశీలించారు. రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల భూములను అన్యాయంగా గుంజుకుంటే చూస్తూ ఊరుకోమని, పెద్ద ఎత్తున ఉద్యమిస్తామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పాలన చేతకాక భూములు అమ్మడమే పనిగా పెట్టుకున్నారని ఆరోపించారు. పేదల భూములు లాక్కొని పెద్దలకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఆయన వెంట బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంజర్ల ప్రకాష్, మాజీ సర్పంచ్ రాజు, ఇతర నాయకులు ఉన్నారు.



ఎనికేపల్లి రైతులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం

గో సేవతో పుణ్యం

మాజీ కౌన్సిలర్ లతాశ్రీ

షాద్‌నగర్ రూరల్: గో మాతకు సేవచేస్తే ఎంతో పుణ్యమని మాజీ కౌన్సిలర్ లతాశ్రీ శ్రీశైలం పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా బాలాగనర్ మండలం మోతీఘణపూర్ గ్రామానికి చెందిన బండ వెంకటేశ్వర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, లక్ష్మమ్మ ఆదివారం పట్టణ సమీపంలోని చౌడమ్మగుట్ట ఆంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలోని శ్రీకృష్ణ గోశాలకు గడ్డి అందజేశారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ లతాశ్రీ శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ.. గో మాతను పూజిస్తే సకల దేవతలను పూజించినట్లేనని పేర్కొన్నారు. గో సంతతి అంతరించిపోకుండా గోవులను రక్షించుకోవడం అందరి బాధ్యతని తెలిపారు. ప్రతిఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవర్చుకొని సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కోరారు. నోరులేని మూగజీవాల రక్షణకు సహాయ సహకారాలు అందించాలన్నారు. అనంతరం గడ్డి వితరణ చేసిన దాతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యుడు సింగపాగలక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.



శ్రీకృష్ణ గోశాలకు గడ్డి అందజేస్తున్న దాతలు

భట్టి విక్రమార్కకు జన్మదిన శుభాకాంక్షలు



శుభాకాంక్షలు తెలుపుతున్న భీంభరత్ తదితరులు

షాబాద్: డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు చేవెళ్ల అసెంబ్లీ ఇంచార్జి పామెన భీంభరత్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం నగరంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా భీంభరత్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ బలోపేతం చేసేందుకు కార్యకర్తలు సైనికుల కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం వైస్ చైర్మన్ మద్దూరు మల్లేశ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్లు పామెన నర్సింహులు, మంగలి చెన్నయ్య, కొమరబండ దేవాలయ చైర్మన్ చేవెళ్ల వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహిస్తాం

షాబాద్: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు కృషి చేస్తామని శ్రీసాయి చైతన్య యువజన సంఘం అధ్యక్షుడు ఎండీ ఇనాయత్, కాంగ్రెస్ నాయకులు రాజు పేర్కొన్నారు. ఆదివారం బోడంపహాడ్‌లో మూడు వారాలుగా సమ్మర్ ఛాంపియన్స్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..క్రీడలతో మానసికోల్లాసం, సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందన్నారు. అనంతరం విజేతలకు బహుమ తులు ప్రదానం చేశారు. బందేశ్వర్, హరి, మల్లేశ్, రఫీక్, భాస్కర్‌రెడ్డి, విష్ణు, శివ, శ్రీశైలం పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న ఇనాయత్, కాంగ్రెస్ నాయకుడు రాజు

పాములకాలం.. జరభద్రం

- మూగజీవాల పట్ల అప్రమత్తం
- చెప్పుకోలేవు.. గుర్తించాలి
- సకాలంలో చికిత్స అందించాలి
- పశు వైద్యాధికారి చంద్రశేఖర్‌రెడ్డి





షాబాద్: వర్షాకాలంలో పాముల బెడద ఎక్కువగా ఉంటుంది. పశువులు మేత కోసం బీడు భూములు, అడవుల్లోకి వెళ్లినప్పుడు విష సర్పాలు కాటేసే ప్రమాదం ఉంది. అలాంటప్పుడు రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రేగడి దోస్వాడ పశు వైద్యాధికారి చంద్రశేఖర్‌రెడ్డి సూచిస్తున్నారు. ఏదైనా కుడితే నోరులేని జీవాలు చెప్పుకోలేవని, రైతులు, కాపర్లు సకాలంలో గుర్తించి తగిన చికిత్స అందించాలి. లేని పక్షంలో అవి మృత్యువాత పడే ప్రమాదం ఉందని తెలిపారు. అటవీ ప్రాంతంలో త్రాచు, కట్లపాము, రక్తపింజరలు ఎక్కువగా సంచరిస్తుంటాయని, అవి ఎక్కువగా పశువుల పాదుగు, కాళ్ల దగ్గర కాటు వేస్తాయని పేర్కొంటున్నారు. మరిన్న వివరాలు వారి మాటల్లోనే.

రక్త పింజర కాటు వేస్తే..

పశువును రక్త పింజర కాటు వేస్తే, హిమోటాక్సిన్ విడుదలయి రక్త ప్రసరణ వ్యవస్థపై ప్రభావం చూపుతుంది. దీంతో పశువు నోరు, ముక్కు నుంచి రక్తం కారుతుంది. కాటు వేసిన చోట వాపు వచ్చి చర్మం రంగు మారుతుంది. మంటగా ఉంటుంది. మూత్రం ఎరుపు రంగులో వస్తుంది. సరైన సమయంలో చికిత్స అందకపోతే పది గంటల లోపు మృత్యువాత పడుతుంది.

త్రాచు, కట్లపాము..

త్రాచు, కట్లపాము పశువులను కాటు వేసినప్పుడు న్యూరోటాక్సిన్ వాటి శరీరంలోకి వెళ్లి నాడీ వ్యవస్థపై ప్రభావం చూపుతుంది. దీంతో శ్వాసకోస వ్యవస్థ స్తంభిస్తుంది. సర్పం కరిచిన చోట మంట ఉండదు. కాని నోటి నుంచి నురగ వస్తుంది. పశువులు అపస్మారక స్థితిలోకి వెళ్తాయి. సరైన సమయంలో చికిత్స అందించకపోతే చనిపోతుంది.

చికిత్స ఇలా..

పశువును పాము కరిచిన చోట గుడ్డతో గట్టిగా కట్టాలి. బ్లేడుతో కోసి రక్తం పిండి వేయాలి. ప్రతి 20 నిమిషాలకు ఒక సారి కట్టును వదులు చేస్తూ మళ్లీ కట్టాలి. ఇలా చేయడంతో విషం పైకి పాకకుండా ఉంటుంది. పామ్ ఆక్రోసిన్ సల్పేట్, ఏవిల్ ఇంజక్షన్లు పశువు రక్త నాళాల్లోకి ఎక్కించాలి. యాంటీ బయోటిక్స్, అనాలెజిక్స్, కార్టికోస్టిరియాడ్స్, గ్లూకోజ్ లాంటి మందులు అవసరాన్ని బట్టి ఇస్తుండాలి. శ్వాసక్రియ ఉత్తేజం చేయడానికి కొరమిడ్, నికాతమైడ్ లాంటి సూది మందు ఇవ్వాలి. సొంత వైద్యం కాకుండా పశు వైద్యుడిని సంప్రదించాలి. త్వరగా స్పందిస్తే మేలు.

రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోండి

కొందుర్గు: అర్హులైన రైతులందరూ రైతు భరోసా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి రాజేందర్ రెడ్డి సూచించారు. ఈ ఏడాది జూన్ 5వ తేదీ వరకు కొత్త పట్టాదారు పాసుపుస్తకం తీసుకున్న వారందరు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా పుస్తకం జతచేసి సంబంధిత ఏఈఓకు అందజేయాలని సూచించారు.

ఈ నెల 18 వరకు..

శంకర్‌పల్లి: అర్హులు ఈ నెల 18వ వరకు దరఖాస్తు చేసుకోవాలని శంకర్‌పల్లి మండల వ్యవసాయాధికారి సురేశ్ బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

మొయినాబాద్‌లో..

మొయినాబాద్: రైతు భరోసా పథకానికి ఈ నెల 18లోపు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి అనురాధ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొయినాబాద్ క్లస్టర్ పరిధిలోని రైతులు ఏఈఓ సునీల్, కేతిరెడ్డిపల్లి క్లస్టర్ పరిధిలో ఏఈఓ కుమార్ నంబర్లపై 6305910249, 6305910250 సంప్రదించాలని కోరారు.

నందిగామలో..

నందిగామ: గతంలో దరఖాస్తు చేసుకోని రైతులు రైతు భరోసా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ విస్తరణ అధికారి రవి కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఈ నెల 5వ తేదీ వరకు కొత్తగా పట్టాదారు పాసుపుస్తకాలు వచ్చిన రైతులు ఈ పథకానికి అర్హులని వివరించారు.

పేదింటి బిడ్డ చదువుకు 'ఉప్పల' అండ

ఆమనగల్లు: తాళ్లగుట్టతండా నిరుపేద బాలిక చిట్టి చదువులకు ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్ అండగా నిలిచారు. గతేడాది 6, ప్రస్తుతం 7వ తరగతికి చేయూతనందించారు. ఈ ఏడాదికి అవసరమైన ఆర్థికసాయాన్ని ఆదివారం అందజేశారు.

పేదల ఇళ్ల స్థలాల కోసం నిరంతర పోరాటం

మొయినాబాద్‌రూరల్: పేదల ఇళ్ల స్థలాల కోసం పోరాటాలు చేస్తూనే ఉంటామని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. మండల పరిధిలోని సజ్జన్‌పల్లిలో ఆదివారం పార్టీ మండల మహాసభను మండల కార్యదర్శి కె.శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జంగయ్య జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. ఇళ్ల స్థలాల కోసం భూ పోరాటాలకు సిద్ధం కావాలని నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. వందేళ్ల చరిత్ర కలిగిన పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఆపరేషన్ కగార్‌తో మావోయిస్టులను అంతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం సైన్యాన్ని పంపడం బాధాకరమన్నారు. మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు కనుగంటి పర్వాతాలు, కె.రామస్వామి, జిల్లా కార్యవర్గ సభ్యుడు ప్రభులింగం, ఏఐటీయూసీ కార్యదర్శి సత్యనారాయణ, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.



జెండా ఆవిష్కరించి మాట్లాడుతున్న పాలమాకుల జంగయ్య

ఎమ్మెల్యే కసిరెడ్డి పరామర్శ

కడ్తాల్: విశ్రాంత ఉద్యోగి కడారి శివరాజ, నార్లకంటి మల్లేశ్‌లు ఇటీవల మృతిచెందారు. ఈ మేరకు ఆదివారం బాధిత కుటుంబాలను కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు బాలాజీసింగ్ తదితరులు పరామర్శించారు. ఇందులో మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, కాంగ్రెస్ జిల్లా జనరల్ సెక్రటరీ బీక్యానాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్ తదితరులు ఉన్నారు.



బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి, నాయకులు

సీఎస్కే విల్లాస్ నూతన కమిటీ

అధ్యక్షుడిగా మహేశ్‌గౌడ్

షాద్‌నగర్ రూరల్: పట్టణంలోని సీఎస్కే విల్లాస్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని ఆదివారం సీఎస్కే విల్లాస్ పార్కులో నిర్వహించారు. నూతన కమిటీ గౌరవ అధ్యక్షుడిగా అరటియాదయ్య, అధ్యక్షుడు మహేష్‌గౌడ్, ఉపాధ్యక్షుడిగా గోపాల్ రమేశ్‌గౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, అరుణ, భాగ్యలక్ష్మి, ప్రధాన క్యాదర్శిగా ప్రసన్న, సహాయ కార్యదర్శులుగా భిక్షపతి, దత్తాత్రేయ, నాగిళ్లకిషోర్, ప్రశాంత్, రాఘవేందర్‌రెడ్డి, సునీత, న్యాయ సలహాదారులుగా ఇంజమూరి నర్సింలు, హరికిషన్, హరీశ్, మీడియా ఇంచార్జిలుగా రాఘవేంద్రగౌడ్, సందీప్‌గౌడ్ ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం నూతన కమిటీ అధ్యక్షుడు మహేష్‌గౌడ్ మాట్లాడుతూ..కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అనంతరం కాలనీ వాసులు నూతన కమిటీ సభ్యులను ఘనంగా సన్మానించారు.



మహేశ్‌గౌడ్‌ను సన్మానిస్తున్న సభ్యులు